# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### రాత్రుల్లు బాయిల కాడనే జాగారం చేసినం.

కాంగ్రెస్ కాలంలో ఎవుసం అంటే ఏడుపొచ్చేది. అరిగోసపడ్డ. అప్పుడు నీళ్లు లేకుండె. కరంటు లేకుండె. మస్తు తిప్పలు పడ్డం. పంటలు ఎండిపోతంటే కండ్ల నీళ్లు పెట్టుకున్నం. ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వక రాత్రుల్లు బాయిల కాడనే జాగారం చేసినం. ఎర్రబుగ్గ ఎప్పుడెలుగుతదా..?



అని సూసెటోల్లం. అప్పుడంత గోస వెట్టి, ఇపుడు ఏదో చేస్తమని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు. వచ్చినా చేసేదేమీ కూడా లేదు. ఇప్పుడు 24 గంటల కరెంటు ఉండడంతో ఎప్పుడు బాయికాడికి పోయిన కరెంట్ చాల్ చేయగానే నీళ్లు పోస్తున్నాయి. రాత్రి తిప్పలు తప్పాయి. రైతులందరూ చాలా సంతోషంగా ఉన్నరు. కేసీఆర్ లాంటి నాయకుడు ఉంటే ఏ రైతుకు కష్టం రాదు. మరోసారి కేసీఆర్‌ను గెలిపించుకుంటే రైతులకు నాణ్యమైన కరెంటు వస్తది. ఈ కాంగ్రెసోళ్లను నమ్ముకుంటే మూడు గంటల కరెంటు అంటున్నారు, 10 హెచ్‌పీ మోటరు అంటున్నారు. ఇట్లయితే రైతులకు పాత రోజులు గుర్తుకు వస్తాయి. అప్పటి చీకటి రోజులు మళ్లీ రావద్దనే కోరుకుంటున్నాం.

**- మారు రాజు, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్)**

### కాంగ్రెసోళ్లను ఇంక నమ్ముతమ?

నాకు నాలుగు ఎకరాల ఎవుసం ఉంది. నా కొడుకులు ఇద్దరు ఎవుసం చేస్తున్నరు. కాంగ్రెసోళ్ల కాలంలో కరెంటు తిప్పలతో నా కొడుకులు పొలం కాడా కరెంటుతో నీళ్లు పారిచ్చేందుకు వంతులు పెట్టుకునేటోల్లు. ఇప్పుడు ఆ తిప్పలు తప్పినయి. కేసిఆర్ సారు కరంటు 24 గంటలు ఇస్తున్నరు. కానీ కాంగ్రెసోళ్లు మూడు గంటలు కరెంటు ఇస్తామని చెబితే నవ్వొస్తుంది.



యాభై ఏండ్ల నుంచి ఏం చేయని కాంగ్రెస్ ఇప్పుడు ఓట్లు అచ్చినయని కరంటు గురించి మాట్లాడుతున్నరు. కాంగ్రెసోళ్లు అప్పుడంత గోస వెట్టి, ఇపుడు ఏదో చేస్తమని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నరని ఇయ్యాలే తెలిసింది. వాళ్లను ఇంక నమ్ముతమ? సీఎం కేసీఆర్ రైతులకు కరంటు ఇచ్చి కష్టాలు తీర్చుతున్నడు. మూడు గంటల కరంటుతో వ్యవసాయం చేసుడు కష్టం. ఇలా రైతులను మోసం చేసే పార్టీలు మనకు వద్దు. సీఎం కేసీఆర్ ఎవుసం తెలిసిన మనిషి. రైతులకు కావాల్సినవన్నీ చేస్తుండు. నేను ముసలోడిని అయేతందుకు వచ్చినా కానీ, ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదు. కేసీఆర్‌కు ఓటేసి గెలిపించుకొని రైతులంతా సంతోషంగా ఉంటాం.

**- నేవూరి బాల్‌రెడ్డి, రైతు (గంభీరావుపేట)**

### రైతులంటే చిన్నచూపు

కాంగ్రెస్ నాయకులకు రైతులంటే చిన్నచూపు. అందుకే వ్యవసాయం విషయంలో ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వాలు రైతులకు తీరని అన్యాయం చేశాయి. కరెంటు విషయంలో మేము పడ్డ కష్టాలు తలుచుకుంటేనే భయమేస్తుంది. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి అంటున్నాడు. అతడు ఓ రైతేనా..? ఎప్పుడన్న వ్యవసాయం చేశాడా. 10హెచ్‌పీ మోటర్‌తో గంటకు ఎకరం పారుతుంది అనడం ఎంతవరకు సమంజసం. మోటర్‌కు డబ్బు లెట్లా..? నెలనెల కరెంట్ బిల్లు కాంగ్రెస్ ఇస్తుందా..? ఆ పార్టీ చేసిన నీతిమాలిన రాజకీయాలు తెలియనిది ఎవరికి. కరెంటుతో పాటు బావుల కాడ మోటర్ల



బిగింపు విషయంలో నిర్మలమ్మ చెప్పిన మాటలు బీజేపీ, కాంగ్రెస్ వ్యవహార శైలిని బట్టబయలు చేసింది. బీఆర్‌ఎస్‌తో పదేండ్ల నుంచి రైతులందరం సంతోషంగా ఉన్నం. రైతుల ముఖంలో ఆనందం నింపిన సీఎం కేసీఆర్‌వైపే మా రైతన్నలం ఉంటాం.

**- మాడుపు లచ్చిరెడ్డి, అడవిపదిర (వీర్నపల్లి)**



### ఆ రోజులను తల్సుకుంటనే దుఃఖం వత్తది

అప్పట్లో నారు పోసిన నుంచి పంట పండే వరకు తిప్పలు పడేటోళ్లం. ఒక్క మడి పారాలంటే మస్తు సార్లు కరంటు పెట్టేటోళ్లం. బీళ్లకు నీరు పారించడానికి, దుక్కులు దున్నానికి, నాటు వేయడానికి నీళ్లు లేకుంటే సాగు పనులు సాగవు. కాంగ్రెసోల్లప్పుడూ బావుల్లో నీరు ఉన్నా కరంటు లేక వచ్చి రాని కరంటుతో పొలం పనులు చేసేటోళ్లం. అంతా చేస్తే చివరికొచ్చేసరికి పంటంతా ఎండేది. అప్పటి గోస తలుసుకుంటే ఇప్పటికీ దుఃఖమొస్తుంది. అంతా గోసపడ్డం. కాంగ్రెసోళ్లు మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నరని ఇయ్యాలే తెలిసింది. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై కుట్రలు చేస్తున్నయని ముందు నుంచి సీఎం కేసీఆర్ చెబుతనే ఉన్నడు. మాకిప్పుడే అర్థమైంది. కాంగ్రెస్, బీజేపీని ఇంక నమ్ముతమా..? వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు కానీ, రైతులను ఆగం చేస్తున్నది. కానీ ఇప్పుడు కేసీఆర్ సారు పుణ్యాన కరంటు, నీటికి ఇబ్బంది లేదు. వ్యవసాయం మంచిగా చేసుకుంటున్నం. సారు సల్లంగుండాలే. మళ్లా కేసీఆర్ సారే రావాలి.

**- చుంచు ఎల్లయ్య, రైతు (ముస్తాబాద్)**

### 10హెచ్‌పీ మోటర్లకు ఎక్కడికిపోవాలి



ఎకరం, ఎకరంన్నర, రెండెకరాలు ఉన్న రైతులకు మూడు, ఐదు హెచ్‌పీల మోటర్లు కొనడమే గగనమైతంది. మరీ 10హెచ్‌పీ మోటర్లు కొనడానికి ఎక్కడికి పోవాలి? ఆ మోటర్లను రైతుల ఎట్లా కొనుకోవాలి? కాంగ్రెసొళ్లు ఏమన్న కొనిత్తరా? వాళ్ల మాటలకు ఎమన్న తరువాయి తంతు ఉన్నదా? నోటికి ఏది వస్తే అది మాట్లాడడమేనా? వెకిలిమాటలు మాట్లాడిన కాంగ్రెసొళ్లకు ఈ ఎలక్షన్ల తగిన బుద్ధి చెప్పాలె. మావి చిన్నచిన్న బావులు. మాకు 10హెచ్‌పీ మోటర్లె అవసరం ఉండది. రైతుల గురించి అవగాహన ఉండి మాట్లాడాలె. అడ్డదిడ్డంగా నోరుపారేసుకోవద్దు. రైతులు ఎంత కష్ట పడుతున్నారో కాంగ్రెస్ నాయకులకు తెలుసా? కేసీఆర్ సారు పుణ్యమా అని కరెంటు, నీళ్లొచ్చినయి. తెలంగాణ వచ్చినంక సంతోషంగా ఉన్నం. అది చూసి కాంగెసొళ్లు ఒర్తలేరు.

**- బోయిని రాములు రైతు (బోయినపల్లి)**

# కాంగ్రెస్‌ను నమ్మితే కరెంట్ ఖతమే



- కాంగ్రెస్‌ను నమ్మితే బతుకుదెరువు ఖతమైతది
- బాయిలకాడ నిద్రలు తప్పవు
- స్పష్టం చేస్తున్న అన్నదాతలు

కరీంనగర్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకుదెరువు కరువైతదని, పదేండ్ల కిందటి చీకటి రాజ్యం మళ్లీ వస్తదని జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కరెంట్ విషయంలో రైతులు పడిన కష్టాలను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఇచ్చిన కరెంట్‌తో పంటలు పండక నష్టపోయిన తీరును ఇప్పుడు గ్రామాల్లో రచ్చ బండల వద్ద చర్చకు పెడుతున్నారు. రాత్రి పూట కరెంట్ ఇవ్వడం వల్ల రైతులు అర్ధరాత్రి, అపరాత్రి బాయిల వద్దకు వెళ్తే ఎదురైన భయంకర అనుభవాలను మర్చిపోలేక పోతున్నామని చెప్పుకుంటున్నారు. రాత్రి పూట బావుల వద్దకు వెళ్తే పాములు, కరిచి, గుడ్డేలుగుల దాడులకు గురై, ఆఖరికి కరెంట్ షాక్‌లతో చనిపోయిన రైతులను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు వాళ్ల కుటుంబాలు పడుతున్న బాధలను చూసి చలించి పోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే మూడు గంటల కరెంట్ ఇస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. ఇలాంటి పార్టీకి అధికారం ఇస్తే నిజంగానే మూడు గంటల కరెంట్ ఇస్తుందనే భయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కరెంట్ విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే బతుకుదెరువు ఖతమైతదని, బాయిల కాడ నిద్రలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటర్లకు మీటర్లు పెడితే భూములు పడావు పెట్టుడేనని చెబుతున్నా. రాష్ట్రంలో ఏ రైతైనా 10 హెచ్‌పీ మోటర్ కొనే పరిస్థితి ఉందా? అని, అంత పెద్ద మోటర్లు, వాటికి అవసరమయ్యే పైపులకు ఖర్చు ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చేదు లేదు.. సచ్చేది లేదుగానీ, పనికిరాని ముచ్చట్లు మాట్లాడుతున్నదని, ఆ పార్టోళ్లను ఎవరూ నమ్మరని స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు పొద్దంతనే అవసరం ఉన్నప్పుడే వెళ్లి కట్క నొక్కితే కరెంట్ వస్తోందని, ఇలాంటి ప్రభుత్వాన్ని కాదని కాంగ్రెస్‌కు ఓటేస్తే తెర్లవుతామనే వాదనలు రైతాంగం నుంచి వినిపిస్తున్నాయి.



### మూడు గంటలే ఇత్తామంటే ఏ మూలకు సాలదు

నాకు నాలుగెకరాల ఎవుసం ఉన్నది. నాడు కరెంటు కోసం అరిగోసపడ్డ. అప్పుడు నీళ్లు లేకుండె. కరంటు లేకుండె. మస్తు తిప్పలు పడ్డం. పంటలు ఎండిపోతంటే కండ్ల నీళ్లు పెట్టుకున్నం. ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వక రాత్రుల్లు బాయిల కాడనే జాగారం చేసినం. తెలంగాణ వచ్చినంక 24గంటల కరెంట్ ఇయ్యవట్టె. ఇగ మాకు రాత్రిపూట పొలాలకు పోయే బాధలు తప్పినయి. ఎప్పుడుపడితే అప్పుడు పొలాలకాడికి పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. ఏ రందీ లేదు. నాడు అరిగోస పెట్టిన కాంగ్రెస్ మళ్లీ ఇప్పుడు మాయమాటలు చెబుతున్నది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు కానీ, రైతులను ఆగం చేస్తున్నది. మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నరని ఇయ్యాలే తెలిసింది. వాళ్లకు ఈ ఎల్లక్షన్ల బుద్ధి చెప్పాలె. కేసీఆర్‌నే మళ్ల గెలిపించుకోవాలె. లేకుంటే గోస అయితది.

**- ములిగే ప్రభాకర్, లక్ష్మీపూర్ (సిరిసిల్ల రూరల్)**

### మళ్ల కేసీఆర్ సార్ రావాల్సిందే

తెలంగాణ రాకముందు కరెంట్, నీళ్లు సక్కగ లేక ఒక పసలే పడేది. దొంగోలే కరెంట్ వచ్చేంది. ఏడు గంటలని చెప్పి ముష్టి మూడు గంటలే ఇచ్చేంది. ఆ మూడు గంటల కరెంట్ ఏ మూలకు సాలేదికాదు. దానికోసం పిట్టకుపెట్టినట్లు చూసోటళ్లం. చాలీచాలని కరెంట్‌తో పొలాలు పారేవికావు. ఎండిపోయేవి. తెలంగాణ వచ్చినంక, కేసీఆర్ సార్ సీఎం అయినంక కరెంట్ గోస తీరింది. మంచిగ 24గంటల పుల్లు కరెంట్ ఇస్తుండు.



నాకు మూడెకరాలు ఉన్నది. మరో ఎకరం కౌలుకు చేస్తున్న. అందులో వరి వేసిన. రెండు పసలు పండిస్తున్నం. ఇప్పుడిప్పుడే మంచిగతైన్నం. రైతులకు ఏం కావాల్నో కేసీఆర్ సారే అన్ని సూసుకుంటుండు. నీళ్లు, కరెంట్ ఇచ్చేసరికి కాంగ్రెసోళ్లు ఆగంజేస్తన్రు. మూడు గంటల కరెంట్‌సాలని అంటున్రు. 24గంటల కరెంట్ ఉండాలంటే మళ్ల కేసీఆర్ సారె సీఎం కావాలె.

**- క్యారం జగత్ కుమార్, తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్)**



### కరెంటు కోసం బావుల వద్దే ఉండేటోళ్లం

కాంగ్రెసోళ్లప్పుడూ నీళ్లు లేక, కరెంటు లేక మస్తు ఇబ్బందులు పడ్డం. మరోవైపు వ్యవసాయ చేయాలంటే తిప్పలు ఉండేది. వాళ్లిచ్చే కరెంటుతో పొలం పారక ఏడేసేటోళ్లం. కరంటు కోసం బావుల వద్దే ఉండేటోళ్లం. ఈ బాధలు ఎప్పుడు తీరుతయో అని అనుకునేటోళ్లం. సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి ఇబ్బందులు లేవు. కరంటు, నీళ్ళు, పెట్టుబడి బీమా కల్పించిన సారుకు మంచి జరగాలి. ఆయన చేసిన పనులు రైతులు మరచిపోరు. పండించిన వడ్లు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చినం. ఇక్కడ ఎండపోసినం. కొనుగోళ్లు కూడ జరుగతున్నయి. ఇప్పుడు అంత మంచిగుంది. కానీ మళ్లిప్పుడూ గా కాంగ్రెసోళ్లు ఎట్లెట్లో మాట్లాడుతుండ్రు. మూడు గంటల కరెంటే సాలందున్రు. అబ్బో మళ్ల వాళ్లొస్తే ఆగమైతం.

**- జంగ ఊర్మిళ, మహిళా రైతు (ముస్తాబాద్)**

### కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులే..

కాంగ్రెస్‌కు అధికారమిస్తే మళ్లీ చీకటి రోజులే వస్తయి. నాడు ఎవుసానికి మూడు గంటల కరెంటు ఇత్తే ఏ మూలకు నీళ్లుపట్టలె. అప్పుడంత గోస వెట్టి, ఇపుడు ఏదో చేస్తమని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు. వచ్చినా చేసేదేమీ కూడా లేదు. అప్పుడు ఏం చేసిండ్లో మాకు తెల్వదా..? ఇప్పుడేం చేత్తరో మాకు తెల్వదా..? సాగునీరు, విద్యుత్ సక్కగ లేకనే చానామంది వలస వెళ్లింది వాస్తవం కాదా? రాత్రిపూట బావులకాడికి పోయిన రైతులు సచ్చిపోయింది నిజం కాదా? తెలంగాణల కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక రైతులందరికి మంచి రోజులు వచ్చాయి. నీళ్లు, కరెంటు పుల్లంటున్నయి. సాగును బంగారం చేసిన కేసీఆర్‌కు అండగా ఉండాలె. మూడోసారి సీఎంను చేసుకోవాలె.

**- బాలసాని శ్రీనివాస్, రైతు (బోయినపల్లి)**





# ధరణి జోలికస్తే ఊరుకోం

రద్దు చేస్తమన్న కాంగ్రెస్‌ను మేమే రద్దు చేస్తం

- ఆ పార్టీకి ఈ ఎన్నికల్ల తగిన బుద్ధి చెబుతం
- భూములకు భద్రత కల్పించిన కేసీఆర్‌కే ఓటేస్తం
- బీఆర్‌ఎస్‌ను కాపాడుకుంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

కరీంనగర్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ కాకుండా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ భూములకు భద్రత లేకుంటా పోతదని, తిరిగి గతంలో అనుభవించిన బాధలు మొదలవుతాయని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నో రోజులు కష్టపడి, అనేక వ్యయప్రయాసలకు ఓర్చుకుని కొత్త రెవెన్యూ చట్టం తెచ్చి తమ భూములకు భద్రత కల్పించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు తమ భూములకు సంబంధించిన హక్కులు, అధికారాలు ప్రభుత్వం చేతిలో ఉండేవని, కొత్తచట్టం వచ్చిన తర్వాత ఏర్పడి ధరణి కారణంగా ఇప్పుడు తమ భూములపై తమకే అధికారం వచ్చిందని అభిప్రాయపడుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని తీసి బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పే విషయాలపై రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. ధరణి ఉండడం వల్లనే ఈ మూడు నాలుగేళ్ల నుంచి భూముల గొడవలు తగ్గాయని అంటున్నారు. యాభై ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ఇంత మంచి ఆలోచన ఎందుకు చేయలేక పోయిందని ప్రశ్నిస్తున్నారు. ఈవ్యవస్థను రద్దుచేయాలని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మరుక్షణమే ఆపార్టీకి పుట్టగతులు లేకుండా పోయాయని చెబుతున్నారు. ధరణిని తొలగిస్తామని చెప్పే కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరిస్తున్నారు.

### మా జాగలు భద్రంగున్నయి

కాంగ్రెస్ గవర్నమెంటుల భూమి పాసుబుక్కుల ఉంటే పహాణీలో ఉండేది కాదు. పహాణిలో ఉంటే పాస్‌బుక్‌లో ఉండకపోయేది. తహసీల్ ఆఫీస్ సుట్టూ తిరిగితిరిగి ఆగం అయ్యేటోళ్లం. పని కోసం ఆఫీసుకుపోతే సార్లుండకపోయేది. సార్లు ఉంటే రేపుమాపు అంటూ పైసల కోసం తిప్పుకొంటుండె. పహాణీ కావాలంటే పది పదిహేను రోజులు సతాయిస్తుంటుండె. ఇగ తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు పుణ్యమా అని ధరణి మంచిగున్నది. అందులో మా భూములు ఆన్‌లైన్ల కనపిస్తున్నయి. పహాణీ కావాలంటే ఐదు నిమిషాల్లో ఇస్తున్నరు. కాంగ్రెసోళ్లు ధరణి తీసివేసి మళ్లీ పాత రెవెన్యూ విధానం తెస్తమని అంటున్నరు. ఎందుకీ పిచ్చి మాటలు. పైసా లంచం ఇవ్వకుండా జాప్యం లేకుండా ధరణితో భూముల రిజిస్ట్రేషన్, భూయజమానుల బదలాయింపు, విరాసత్, మ్యుటేషన్ వంటివి ఎంతో సులువుగా అయితున్నయి. ధరణి రద్దు చేస్తే మళ్లీ పాత పంచాయితీలు వస్తయి. మంచిగున్న ధరణి రద్దు చేస్తమంటూ ఊరుకోం.

**- రేగుల దేవయ్య, శాత్రాజుపల్లి (వేములవాడ)**



### 'ధరణి' నూటికి నూరుశాతం ఉండాలె..

ప్రస్తుతం ఉన్న ధరణి పోర్టల్ ఉండడం వల్లేనే భూములు, వాటి రికార్డులు భద్రంగా ఉంటున్నాయి. ధరణి మా భూములకు భద్రత కవచం వంటిది. కాంగ్రెసోళ్లంతా ఇంత మంచిగున్న ధరణిని తీసేసేందుకు కుట్రలు పన్నుతున్నరు. మళ్ల పట్వారా వ్యవస్థ తీసుకొస్తమంటున్నరు? మళ్ల రైతులకు భూములు చిక్కులు పెట్టి పంచాయితీలు తయారు చేస్తరు. గతంల భూముల విషయంలో గొడవలు, కోర్టు కేసులు చూసినం. కానీ ధరణి వచ్చినంక ఇబ్బందుల్లేవు. ధరణి పోర్టల్ నూటికి నూరు శాతం ఉండాలి. మళ్లీ ఖచ్చితంగా కేసీఆర్ సారె రావాలి.

**- ఎదునూరి బాలమల్లయ్య, పదిర (తెలంగాణచౌక్)**



### ధరణి లేకుంటా పథకాలు ఎట్లిస్తరంట

ధరణి లేకుండా పథకాలు ఎట్లా ఇస్తా రు. ధరణి పోర్టల్‌ను తీసేస్తమని కాంగ్రెసోల్లు సొల్లుతున్నరు. ఇగ ధర ణి లేకుండా రైతులకు పథకాలన్నీ ఎట్లిస్తరంట? రైతు పేరు లేదనో, రైతు కు పట్టా బుక్కు లేదనో అసలు పట్టా బుక్కులలో తప్పులను చూపుతూ పథకాలు ఎగ్గొడతరా మరీ? లేకపోతే మళ్లీ వీఆర్‌వోలను తెస్తరా. ఇట్లయితే కష్టమే మరి. ఇక వీఆర్‌వోల చుట్టూ, ఏవోల చుట్టూ తిరగమని చెప్తరో ఏమో. రైతుల పేర్లు, పంట వివరాలు ధరణిలోనే ఉన్నయి. ఇప్పుడు వీల్లొచ్చి దాన్ని తీసివేస్తే మా పేర్లన్నీ ఏం గావాలని అడుగుతున్న. పేర్లు అందులో ఎక్కించుకోవాలన్నా ఒకల్ల కాడకి, ఏం పంట ఏసినమో చెప్పుకోవాలన్నా ఇంకొకల్ల కాడికి తిరగాలే. గతంల తహసీల్ ఆఫీసుకు తిరిగి గోసపడ్డం. తెలంగాణ వచ్చినంక పైసా లంచం ఇవ్వకుండా ధరణితో భూముల రిజిస్ట్రేషన్, భూ యజమానుల బదలాయింపు, విరాసత్, మ్యుటేషన్ వంటివి ఎంతో సులువుగా అయితున్నయి. భూములకు భద్రత వచ్చింది.

**- లక్ష్మి, చంద్రంపేట (కలెక్టరేట్)**

### నాడు పైసలిత్తనే పనిఅయ్యేది..

తెలంగాణ రాకముందు పట్వారీల పెత్తనం ఉండేది. వాళ్లు ఎవరూ పైసలిత్తే వారికి భూములు పట్టాజేత్తుండె. మనసొంటి చిన్నరైతులు పట్టాజేసుకుందామని పోతే పైసలియ్యందే పనిగాకుండె. అయినా గానీ ఆఫీసుల సుట్టూ తిప్పుకొంటుండె. నాడు కాంగ్రెస్ గవర్నమెంటుల రైతులు చానా గోసపడ్డరు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ తెచ్చిన ధరణి మంచిన్నది. స్లాట్ బుక్ చేసుకున్న మరుసటి రోజున అద్ద గంటలనే భూమి పట్టాకావట్టె. నేను ఏడాది కింద 20గుంటలు రిజిస్ట్రేషన్ చేయించుకున్న. మా ఎల్లారెడ్డిపేట మండలాఫీసులోనే రిజిస్ట్రేషన్ చేసిన్రు. అద్ద గంటలనే నాపొంటి పట్టా జేసిన్రు. చాలా సంతోషమనిపించింది. గింతమంచిగ జేసిన కేసీఆర్ సారుకు అండగ ఉంటం. ఆయననే మళ్ల గెలిపించుకుంటం.



**- కిషన్, హరిదాస్‌నగర్ (సిరిసిల్ల)**

### ధరణి తీసివేస్తే అరిగోసపడుతం

అప్పట్లో రాత పద్ధతిలో రికార్డులు మార్చేటోళ్లు. భూమి అమ్మలన్నా.. కొనాలన్నా అధికారుల సుట్టూ, ఆఫీసుల సుట్టూ చెప్పులరిగేలా తిరుగుతుండె. పైసలు ఇయ్యనిదే పని గాకుంటుండె. కొద్దిరోజుల కింద కొంత భూమిని నాపొంటి పట్టాజేసుకున్న. మండలాఫీసులోనే అద్ద గంటలనే సార్లు నాపొంటి పట్టాజేస్తే అశ్చర్యమనిపించింది. గింత మంచిగున్న ధరణిని తీసివేస్తామని కాంగ్రెసొళ్లు అంటున్నరు. అట్లయితే అరిగోసపడుతం. అయినా వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు. వచ్చినా చేసేదేమీ కూడా లేదు. అప్పుడు ఏం చేసిండ్లో మాకు తెల్వదా..? ఇప్పుడేం చేత్తరో మాకు తెల్వదా..? అట్టిగ ఆగంచేస్తున్నరు. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై కుట్రలు చేస్తున్నయని ముందు నుంచి సీఎం కేసీఆర్ చెబుతనే ఉన్నడు. మాకిప్పుడే అర్థమైంది. ఇంక వాళ్లను నమ్ముతమా..? తప్పిదారి ఓటేత్తే కచ్చితంగా రైతుల కథ మళ్లీ మొదటికి అచ్చినట్టే. అందుకే రైతులందరూ అప్రమత్తంగా ఉండాలె. కేసీఆర్‌నే మళ్ల గెలిపించుకోవాలె.



**- శీల రమేశ్, గంభీరావుపేట (సిరిసిల్ల)**

### పాత పద్ధతి వస్తే పంచాయితీలె..

ధరణి ఎత్తివేసి పాత పంచాయితీలు తీసుకువస్తే గ్రామాల్లో రోజు పంచాయితీలే అయితయి. కొట్టుకోవటాలు, సంపుకోవటాలే ఉంటాయి. సీఎం కేసీఆర్ ఇవన్నీ చూసిండు కాబట్టే రైతుల బాధలు తీర్చేందుకు ధరణి పోర్టల్ తీసుకొచ్చిండు. ధరణి ఉంది కాబట్టే భూముల ధరలు పెరిగినా.. ఎవరి భూమి వారి వద్ద భద్రంగా ఉన్నది. రికార్డులు మంచిగున్ననయి. వాటి ప్రకారమే రైతుబంధు రావట్టె. ధరణి ఎత్తేస్తే రికార్డులు తారుమారై రోజుకో పంచాయితీ అయితది. మేము భూములు అమ్మలన్నా.. మరొకరు కొనాలన్నా తహసీల్ ఆఫీసు సుట్టూ తిరగాల్సిందే. భయంకరమైన పాత రోజులు వస్తయి. లేనిపొని చిక్కులు సృష్టించి రైతులను కష్టాల పాలు చేస్తరు. రైతులందరూ మళ్ల కేసీఆర్ సారునే గెలిపించుకుంటం.



**- జక్కుల మల్లయ్య (వీర్నపల్లి)**

